క్లుప్తంగా

ఫీజు వివరాలతో బోర్డులు ఏర్పాటు చేయాలి



ప్రైవేటు పాఠశాలల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎంపీపీ

అంబాజీపేట: ప్రైవేటు విద్యాసంస్థలు వసూలు చేసే ఫీజుల వివరాల బోర్డును స్కూళ్ల వద్ద అందరికీ కనిపించేలా ఏర్పాటు చేయాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఎంపీపీ చాంబర్‌లో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యంతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలల్లో అందించే విద్యలో భాగంగా మండలంలో అన్ని గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. 25 శాతం సీట్లను భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బస్సులు, ఇతర వాహనాలు ఉన్న పాఠశాలలు అత్యంత జాగ్రత్తలు పాటించాలన్నారు. సమావేశంలో ఎంఈఓలు కాండ్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్ పాల్గొన్నారు.

సంపూర్ణ పారిశుధ్య చర్యలు పాటించాలి



జొన్నాడలో డ్రైడే ఫ్రైడే నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పేందుకు వీలుగా ప్రతి శుక్రవారాన్ని పొడి వారం (డ్రైడే)గా పాటించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు కె.శ్రీకాంత్, డి.సాయికిషోర్ కోరారు. ఫ్రైడే డ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశా సిబ్బంది ఇంటింటికీ వెళ్లి, నిల్వ నీరు ఉండకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. దీనివల్ల క్రిమికీటకాలు దరిచేరవని, తద్వారా అంటు వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉండదన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాల పరిశుభ్రతను పాటించి మెరుగైన ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పాలని కోరారు. పలు గ్రామాల్లో ఆరోగ్య, ఆశా సిబ్బంది ర్యాలీలు నిర్వహించారు. సీహెచ్‌ఓ ఎంఎస్‌ఎన్ రెడ్డి, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు, సూపర్‌వైజర్లు తదితరులు పర్యవేక్షించారు.

గన్నవరపు పరామర్శ



లక్ష్మీనారాయణను పరామర్శిస్తున్న శ్రీనివాసరావు

అంబాజీపేట: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వక్కలంకకు చెందిన దారా లక్ష్మీనారాయణను జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు పరామర్శించారు. సంపూర్ణ ఆరోగ్యంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్, నాయకులు వాసంశెట్టి పెదబాబు, పిల్లి రమేష్, యల్లమిల్లి జయబాబు, వాసంశెట్టి వీరాంజనేయులు, కొప్పిశెట్టి వెంకటేశ్వరరావు, నేదునూరి వెంకటేశ్వరరావు, జనుపల్లి ఏడుకొండలు, కొప్పిశెట్టి సాయి ఉన్నారు.

అయినవిల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన పోట్టిలంక సర్పంచ్ కోనే సునీత సుబ్బలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకుడు చంద్రశేఖర్ తనయుడు ఆనంద్ గోపాల్‌తేజను గన్నవరపు శ్రీనివాసరావు పరామర్శించారు. వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. ఆయన వెంట నాయకులు వాసంశెట్టి తాతాజీ, రావూరి బుజ్జి, ఇసుకపట్ల వెంకటరమణ, మిండగుదిటి శిరీష్, పంతాడి బలరాం తదితరులున్నారు.

సహస్ర నామ పారాయణ

మలికిపురం: గ్రామంలోని ఎత్తు వంతెన వద్ద నూతనంగా నిర్మించిన హరి హరసుత అయ్యప్ప స్వామి ఆలయం వద్ద శుక్రవారం సహస్రనామ పారాయణం జరిగింది. అనంతరం ఆలయ అర్చకులు నందన్ సంబూద్రి ఆధ్వర్యంలో అష్టైశ్వర లక్ష్మి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.




కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

పుచ్చ పంట.. తీరంలో పండెనంట..

- నాలుగేళ్లుగా రాణిస్తున్న రైతు
- విస్తారంగా కర్బూజా కూడా..
- లాభాల్లో కొనసాగుతున్న సాగు



కేశనపల్లిలో పుచ్చకాయలు పండిస్తున్న రైతు



ఇసుక నేలలో పండించిన పసుపు పుచ్చకాయ

మలికిపురం: సముద్ర తీర ప్రాంతమైన మలికిపురం మండలం కేశనపల్లిలో సాధారణ పుచ్చకాయలతో పాటు, కర్బూజా, పసుపు రంగు పుచ్చకాయల పంట సాగు జరుగుతోంది. సఖినేటిపల్లి మండలం రామేశ్వరం గ్రామానికి చెందిన అభ్యుదయ రైతు దొమ్మేటి శ్రీనివాస్ నాలుగేళ్ల క్రితం ఎకరం భూమి కౌలుకు తీసుకుని ప్రయోగాత్మకంగా ప్రారంభించిన ఈ పంట సాగు ప్రస్తుతం పది ఎకరాలకు చేరి.. అద్భుత ఫలితాలను ఇస్తోంది. రైతు శ్రీనివాస్ గతంలో ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లారు. స్వదేశానికి తిరిగొచ్చి కేశనపల్లి గ్రామంలోని యర్రంశెట్టి సుబ్బారావు, కృష్ణకు చెందిన భూమిని కౌలుకు తీసుకున్నారు. ఇప్పటి వరకూ కేవలం సరుగుడు సాగుకే పరిమితమైన ఇక్కడి ఇసుక నేలలో అరుదైన పుచ్చతో పాటు, పసుపు రంగు పుచ్చకాయల సాగు ద్వారా మంచి లాభాలు సాధించారు రైతు శ్రీనివాస్. అంతేగాక కర్బూజా సాగు కూడా ప్రారంభించారు. ఇతర ప్రాంతాలకే పరిమితమైన ఈ పండ్ల సాగును కోస్తా తీరంలో పండించి విజయం సాధించారు.

వెనకడుగు వేయక..

తొలి ఏడాది ఇదే భూమిలో పుచ్చ, గుమ్మడి సాగు చేయగా.. నష్టం వచ్చింది. అంతటితో వెనకడుగు వేయకుండా 2022లో కూడా సాగు చేసి, ఎకరానికి రూ.1.60 లక్షల ఆదాయం పొందారు. ఆయనకు ఎకరానికి కేవలం రూ.60 వేల పెట్టుబడి అయింది. సాధారణ ఎరుపు రంగు పుచ్చతో పాటు, పసుపు రంగు పుచ్చకాయలు కూడా ఇక్కడ పండాయి. చాలా తీపిగా ఉండే కర్బూజా కూడా ఇదే భూమిలో పుచ్చతో పాటు ఏక కాలంలో పండిస్తున్నారు. ఆయా కాయలు ఇప్పటి వరకూ కాలిఫోర్నియాలో మాత్రమే సాగయ్యాయని, ఇక్కడ సాగు చేయడం ఇదే తొలిసారి అని రైతు శ్రీనివాస్ అంటున్నారు. సగటున పుచ్చకాయ బరువు 8 కేజీలు, కర్బూజా బరువు 4 కేజీలు ఉన్నట్లు తెలిపారు.

నష్టాలకు భయపడలేదు



తొలి ఏడాది సాగులో కొంత నష్టం వచ్చింది. అయినా భయ పడలేదు. వెనకడుగు వేయలేదు. తర్వాత ఏడాది కూడా ఇదే పంట వేశాను. ఆదాయం బాగానే వచ్చింది. నాలుగేళ్లుగా లాభాల్లో సాగు చేస్తున్నాను. తక్కువ ఖర్చుకు సాగు చేస్తుండడంతో.. తక్కువ ధరకే విక్రయాలు సాగిస్తున్నాను. పూర్తిగా డ్రిప్ ఇరిగేషన్‌పై సాగు చేస్తున్నాం. ప్రభుత్వ ప్రోత్సాహం అందిస్తే మరింతగా విస్తరిస్తాం.

– దొమ్మేటి శ్రీనివాస్, కౌలు రైతు

భారత్ విజయం కాంక్షిస్తూ పూజలు

మలికిపురం: భారత్–పాకిస్తాన్ మధ్య జరుగుతున్న భీకర యుద్ధంలో మన దేశం విజయం సాధించాలని, భారత త్రివిధ దళ అధినేతలు, ప్రధానికి భగవంతుని ఆశీస్సులు ఉండాలని కోరుతూ కేశనపల్లి సత్యేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం బీజేపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ మాట్లాడుతూ, యుద్ధ సమయంలో దేశమంతా ఏకతాటిపై ఉండడం అభినందనీయమన్నారు. జాతి ఐక్యతకు ఇది చిహ్నమన్నారు. పార్టీ నాయకులు అడబాల రాంబాబు, మేడిచర్ల చాణక్య, నీటి సంఘం ఉపాధ్యక్షులు కాపిశెట్టి కనకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కేశనపల్లి ఆలయంలో పూజలు చేస్తున్న నాయకులు

సర్వమత ప్రార్థనలు చేయాలి

కొత్తపేట: భారత్–పాకిస్తాన్ మధ్య జరుగుతున్న యుద్ధంలో మన దేశ సైనికుల విజయాన్ని కాంక్షిస్తూ సర్వమత ప్రార్థనలు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం కోరారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుత యుద్ధంలో భారత సైనిక దళాలు శత్రు సైన్యాన్ని అంతమొందించేలా దూసుకెళుతున్నాయన్నారు. హిందువులు ఆలయాల్లో, క్రిస్టియన్లు చర్చిల్లో, ముస్లింలు మసీదుల్లో భారత్ విజయం కోసం ప్రార్థించాలని కోరారు.

ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా పూజలు

రాజోలు: భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా శుక్రవారం రాజోలు ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి. దేశ సైనికులకు సంఘీభావంగా స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో నినాదాలతో హోరెత్తించారు. చిన్నారులు జాతీయ జెండాలు చేతపట్టుకుని మద్దతు తెలిపారు. రాజోలు చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్, వీహెచ్‌పీ అధ్యక్షుడు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం, ఆర్యవైశ్య మహిళా అధ్యక్షురాలు కాసు భవాని, కొత్త పద్మావతి, న్యాయవాది గంటి రవికుమార్, రాజా నాగరత్న కుమార్, కొప్పిశెట్టి వెంకీ, దార్ల బాపూజీ పాల్గొన్నారు.



రాజోలు గాంధీ బొమ్మ సెంటర్‌లో సంఘీభావం తెలుపుతున్న నాయకులు

బాల్య వివాహాలతో దుష్పరిణామాలు

సఖినేటిపల్లి: సమాజంలో బాల్య వివాహాల వల్ల దుష్పరిణామాలు కలుగుతాయని ఐసీడీఎస్ సీడీపీఓ వైకేడీ రమాదేవి అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం మోరి సుబ్బారాయుడుపేట అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి బాలికలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి పాల్గొన్నారు. కిశోరి వికాసం పేరిట ఏర్పాటు చేసిన ఈ సదస్సుకు సర్పంచ్ ముప్పర్తి అలివేలు గంగాత్రివేణి అధ్యక్షత వహించారు. పోషకాహారం తీసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, బాల్య వివాహాలు చేయరాదని వివరించారు. దీనివల్ల ఎదురయ్యే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ ఎస్.చంద్రకళ, పంచాయతీ కార్యదర్శి అనూష పాల్గొన్నారు.



మోరిలో మాట్లాడుతున్న సీడీపీఓ రమాదేవి

మలికిపురం: బాల్య వివాహాలతో దుష్ఫలితాలు తప్పవని, గ్రామీణ ప్రాంతాల ప్రజలు అవగాహనతో మెలగాలని ఐసీడీఎస్ పీడీ బి.శాంతకుమారి అన్నారు. మలికిపురంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరిగిన కిశోరి వికాసం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాల వల్ల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం ఉంటుందన్నారు. కార్యక్రమంలో రాజోలు సీడీపీఓ వైకేడీ రమాదేవి, సూపర్‌వైజర్ కె.హైమావతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం రాశులు



అయినవిల్లిలో తడిసిన ధాన్యానికి బరకాలు, కొబ్బరాకులు కప్పుతున్న రైతులు

అకాల వర్షాలకు రైతుల గగ్గోలు

అయినవిల్లి: అకాల వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యంరాశులు శుక్రవారం తడిసి ముద్దయ్యాయి. అయినవిల్లి, సిరిపల్లి, నేదునూరు, విలస, కె.జగన్నాథపురం, శానపల్లిలంక, ఎస్.మూలపాలెం, మాగాం తదితర గ్రామాల్లోని ధాన్యపురాశులు తడిసిపోయాయి. మండలంలో వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. యంత్రాలతో కోతలు కోసిన ధాన్యాన్ని రహదారులపైనా, కళ్లాల్లో రైతులు ఆరబెడుతున్నారు. అకాల వర్షం కారణంగా ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. దీంతో రైతులు వాటిన రాశులుగా పోసి రక్షించుకున్నారు. తడిసిన ధాన్యం మొలకవచ్చే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నెలలోనే మూడు సార్లు వచ్చిన అకాల వర్షాలు తమ పంటలను పాడు చేశాయని రైతులు చెబుతున్నారు. తడిసిన ధాన్యానికి గిట్టుబాటు ధర ఇవ్వకపోవడం కాదు కదా.. దళారులు అయినకాడికి అడుగుతున్నారని చెబుతున్నారు. ప్రభుత్వమే తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

రక్త పింజర హతం

మామిడికుదురు: మామిడికుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద భారీ రక్త పింజర శుక్రవారం కలకలం రేపింది. డొంకల్లో నక్కిన రక్త పింజరని చూసిన స్థానికులు దాన్ని కొట్టి హతమార్చారు. దీని పొడవు ఐదు అడుగులకు పైగా ఉందని వారు తెలిపారు. దాని పొట్టలో పిల్లలు ఉన్నాయన్నారు. ఇటీవల కాలంలో రక్త పింజర్లు పలు ప్రాంతాల్లో కనిపిస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.

మామిడికుదురులో హతమార్చిన రక్త పింజర →



వైభవంగా స్వామివార్ల కల్యాణం



ఈదరాడలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మామిడికుదురు: ఈదరాడ గ్రామంలో కొలువై ఉన్న ఉమా సోమేశ్వరస్వామి, శ్రీలక్ష్మీ నర్సింహస్వామి వార్ల కల్యాణ మహోత్సవాన్ని గురువారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, వేద మంత్రాలు, భక్తుల కోలాహలం నడుమ అర్చక స్వాములు స్వామివార్ల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామివార్ల ఉత్సవమూర్తులను గ్రామంలో ఊరేగిస్తూ, కన్నుల పండువలా గ్రామోత్సవాన్ని జరిపించారు. అనంతరం కల్యాణం నిర్వహించారు. కల్యాణోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అర్చకుల నుంచి వేదాశీర్వచనం అందుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కల్యాణోత్సవం సందర్భంగా స్వామివార్ల ఆలయాలను వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు.

పార్వతీ భీమేశ్వరస్వామి కల్యాణం

సఖినేటిపల్లి: మండల కేంద్రంలో కొలువైన పార్వతీ భీమేశ్వర స్వామివారి వార్షిక కల్యాణం గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. శైవాగమ పండితులు పూజ్యం విశ్వనాథశర్మ బ్రహ్మత్వంలో అర్చకుల పర్యవేక్షణలో గ్రామానికి చెందిన రుద్రరాజు రఘురామ కృష్ణంరాజు, శ్రీదేవి దంపతులతో ఈ కల్యాణం చేశారు. మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, మాజీ ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు, వసుధ ఫౌండేషన్ కన్వీనర్ జంపన బుజ్జిరాజు స్వామివారికి పూజలు చేశారు. దెందుకూరి శ్రీహరి రాజు, రుద్రరాజు చినరాజా, రమేష్‌రాజు, కుసుమ చంద్రశేఖర్, ఈద రవిరెడ్డి, సర్వెళ్ల విజయ్‌ప్రసాద్, అటారం మాస్టారు, తాడి సహదేవ్, కె.కిషోర్, పాటి శివకుమార్, అయినవిల్లి సత్యనారాయణ పాల్గొన్నారు. అనంతరం మూడు వేల మందికి అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, రుద్రరాజు రామలింగ రాజు ఫ్యామిలీ ట్రస్టు ప్రతినిధులు పాల్గొన్నారు.



సఖినేటిపల్లిలో స్వామివారిని దర్శించుకుంటున్న ప్రముఖులు

ట్రాఫిక్ నిబంధనలతో ప్రమాదాల నియంత్రణ

ఆలమూరు: వాహనదారులందరూ ట్రాఫిక్ నియమాలపై అవగాహన కలిగి ఉండాలని, ప్రమాదాల నివారణకు భద్రత నియమావళి తప్పనిసరిగా పాటించాలని రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ అన్నారు. మండలంలోని జొన్నాడ జాతీయ రహదారి, కాకినాడ వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డుపై ఆలమూరు ఎస్సై ఎం.అశోక్‌తో కలిసి ఆయన శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ముగ్గురు ద్విచక్ర వాహనదారులను, ఓ ట్రాక్టర్ డ్రైవరు, మరో లారీ డ్రైవర్‌పై కేసులు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు. బస్సులో వెళ్లే ప్రయాణికులు బాణసంచా, మద్యం బాటిళ్ల వంటివి తీసుకుని వెళ్లరాదని సూచించారు. వాహనాలకు సరైన పత్రాలు లేని వాహనదారులకు రూ.15 వేల అపరాధ రుసుము విధించారు. వాహనదారులకు రోడ్డు భద్రత నియమావళిపై అవగాహన కల్పించారు. రోడ్డు మధ్యలో వాహనాలను ఆపి ప్రయాణికులను ఎక్కించడం, దింపడం వంటివి చేయరాదని, ఎక్కువ ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో గంటలకొద్దీ వాహనాలను ఆపరాదని, ఆటోలపై పరిమితికి మించి ప్రయాణికులను తరలించరాదని స్పష్టం చేశారు. అతివేగంతో వాహనాలను నడపరాదని సూచించారు. వాహనాల పత్రాలు వాహనంతోనే ఉంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. తనిఖీల్లో హైవే పోలీస్ పెట్రోలింగ్ అధికారులు పాల్గొన్నారు.



జొన్నాడలో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష నిర్వహిస్తున్న సీఐ విద్యాసాగర్

కనుమూరి ఇంట నేతల సందడి



కనుమూరితో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి, మాజీ ఎంపీ అనురాధ తదితరులు ←

కొత్తపేట: వైఎస్సార్ సీపీ ఆత్రేయపురం మండల అధ్యక్షుడు కనుమూరి శ్రీనివాసరాజు ఇంట ఆయన కుమార్తె వివాహ వేడుకలో జిల్లావ్యాప్తంగా నాయకులు పాల్గొని సందడి చేశారు. శ్రీనివాసరాజు కుమార్తె సింధుకు, ఐ.పోలవరం మండలం ఎదుర్లంకకు చెందిన అరవింద్‌వర్మకు శుక్రవారం రాత్రి ఆత్రేయపురం మహారాజ ప్యాలెస్‌లో వివాహం జరిగింది. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, మాజీ ఎంపీ చింతా అనురాధ, పార్టీ రాజోలు, రామచంద్రపురం నియోజకవర్గాల కో–ఆర్డినేటర్లు గొల్లపల్లి సూర్యారావు, పిల్లి సూర్యప్రకాష్, ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు, కిమ్స్ చైర్మన్ చైతన్యరాజు, కొత్తపేట ఎంపీపీ మార్గన గంగాధరరావు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కప్పల శ్రీధర్, నాయకుడు ముసునూరి వెంకటేశ్వరరావు తదితరులు వధూవరులను ఆశీర్వదించారు.

కమనీయం కురంగేశ్వరుని కల్యాణం

తాళ్లరేవు: చరిత్ర ప్రసిద్ధిగాంచిన పాతకోరంగి బాల త్రిపుర సుందరీ సమేత కురంగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం కమనీయంగా నిర్వహించారు. ఆలయ ఈఓ కేవీవీ వేణుగోపాల్ పర్యవేక్షణలో వైశాఖ ఏకాదశి పర్వదినం సందర్భంగా గురువారం రాత్రి స్వామి వారి కల్యాణాన్ని అర్చకులు కేఆర్‌కే సాయిప్రసాద్, వేద పండితులు కందికొండ బాబీశర్మ వైభవంగా నిర్వహించారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది. స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

తాటిపాక జీసీఎస్ వద్ద మాక్ డ్రిల్



నగరంలో నిర్వహించిన మాక్ డ్రిల్

మామిడికుదురు: భారత్–పాకిస్తాన్ దేశాల మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ నగరంలోని తాటిపాక జీసీఎస్ ప్రాంగణంలో శుక్రవారం పౌర రక్షణపై మాక్ డ్రిల్ నిర్వహించారు. సంఘ విద్రోహ చర్యలను అడ్డుకోవడం, శాంతి భద్రతలను కాపాడడం, ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ మాక్ డ్రిల్ చేపట్టారు. అగ్ని ప్రమాదాలు, పేలుళ్లు, అనుమానాస్పద వస్తువులు కనిపించిన సందర్భంలో తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. సైరన్ మోగినప్పుడు ఎలా స్పందించాలనే విషయాలపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రొడక్షన్ జీఎంలు కేజీఎం రాము, ఎస్‌వీఆర్ శివకుమార్, నగరం ఎస్సై ఎ.చైతన్యకుమార్, ఆర్ఐ ఇబ్రహీం, సర్పంచ్ జాలెం రమణకుమారి, పోలీసులు, సీఐఎస్ఎఫ్, ఏపీఎస్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు ప్రత్యేక వైద్య శిబిరం



గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్న వైద్యులు

పి.గన్నవరం: ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌లో భాగంగా నాగుల్లంక పీహెచ్‌సీలో వైద్యాధికారులు వైవీ ప్రియాంక, ఆర్.మౌనిక మణి ఆధ్వర్యంలో శుక్రవారం గర్భిణులకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. 35 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. బోళ్ల మురళీ మోహన్‌రావు ఆధ్వర్యంలో వారికి పౌష్టికాహారం అందించారు. ఎంపీహెచ్ఈఓ ఎ.నాగరాజు, పీహెచ్ఎన్ ఎంఎస్ఎస్ కుమారి, ఎంపీహెచ్ఎస్‌లు బీవీవీఎస్ఎన్ మూర్తి, కేసీహెచ్ మరియమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎదురెదురుగా ఢీకొన్న లారీలు

ముమ్మిడివరం: మండల పరిధిలోని అనాతవరం వై.జంక్షన్ వద్ద శుక్రవారం మధ్యాహ్నం ఎదురెదురుగా వస్తున్న రెండు లారీలు ఢీ కొన్నాయి. చేపల లోడుతో వెళుతున్న లారీ, ఎదురుగా వస్తున్న మరో లారీని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. ఢీకొన్న లారీలు రోడ్డుకు అడ్డంగా నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. దీంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. ముమ్మిడివరం ఎస్సై డి.జ్వాలాసాగర్ ఆధ్వర్యంలో పోలీసులు లారీలను పక్కకు తొలగించి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

నందీశ్వరునికి అభిషేకం

తాళ్లరేవు: సుంకరపాలెంలో వేంచేసియున్న భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం నందీశ్వరునికి అభిషేకం నిర్వహించారు. త్రయోదశి సందర్భంగా అర్చకుడు శ్రీకంఠం గిరి బాబుశర్మ ఆధ్వర్యంలో దంగుడుబియ్యం వీర వెంకట సత్యనారాయణ, సత్య దంపతులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. నందీశ్వరునికి అభిషేకం చేసేందుకు దాత సత్యనారాయణ రూ.42 వేల విలువ చేసే వెండి బిందెను సమర్పించారు.

అభివృద్ధికి ఓఎన్‌జీసీ సహకరించాలి



పెదపళ్లలో పేషెంట్ వెయిటింగ్ హాలును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఆలమూరు: చమురు, సహజ వాయువుల అన్వేషణ చేస్తున్న ప్రాంతాలను మరింత అభివృద్ధి చేసేందుకు ఓఎన్‌జీసీ సహకరించాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కోరారు. మండలంలోని పెదపళ్ల, పినపళ్ల గ్రామాల్లో శుక్రవారం ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఆయా పంచాయతీ కార్యాలయాల వద్ద సర్పంచ్‌లు సంగిత సుభాష్, ఏడిద సత్యశ్రీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యేతో పాటు, రాజమహేంద్రవరం ఓఎన్‌జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంతానదాసు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. పెదపళ్ల, పినపళ్లలో రూ.20 లక్షలతో కొనుగోలు చేసిన ట్రాక్టర్లను, రూ.12 లక్షలతో పెదపళ్ల పీహెచ్‌సీలో నిర్మించిన పేషెంట్ వెయిటింగ్ హాల్‌ను వారు ప్రారంభించారు. రాష్ట్ర ఉత్తమ పంచాయతీ అవార్డు గ్రహీత సర్పంచ్ సంగిత సుభాష్‌ను ఈ సందర్భంగా సత్కరించారు. కృష్ణప్రభాష్ పేపరుమిల్లు ఎండీ వంక సత్యనారాయణ, డైరెక్టర్ వల్లూరి వెంకట్రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ వక్కపట్ల లక్ష్మణరావు, నీటి సంఘం చైర్మన్ గారపాటి శ్రీనివాసు, ఎంపీటీసీ పెద్దిరెడ్డి పట్టాభి తదితరులు పాల్గొన్నారు.

